# మన'వే'మన పద్యాలు

**ఆ. వె. మాటలాడుటొకటి, మనసులో నొక్కటి,**
**ఒడలి గుణము వేరె, యోజవేరె**
**ఎట్లు గలుగుముక్తి యీలాగుతానుండ?**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**అర్థములు** : ఒడలి గుణము = శరీరముతో చేయు కర్మ;
యోజ = ఆలోచన;

**తాత్పర్యము** : మనసులోని ఆలోచన ఒకటి, పైకి చెప్పేది ఒకటి, చేసేది వేరొకటి, ఇది దుర్జన స్వభావము. ఇటువంటి వారికి ముక్తి యెట్లు వచ్చును? మహాత్ములు, మనసులో ఆలోచించేది మాటలాడుతారు. ఆ చెప్పినది అక్షరములా ఆచరిస్తారు. ఇది వారి స్వభావము. త్రికరణశుద్ధితో వారు మెలగుతారు. దురాత్ములు మనసులో ఆలోచించేది వేరు, పైకి చెప్పేది వేరు, ఆచరించునది వేరు. ఇట్లు త్రికరణ శుద్ధిలేని దుర్జనులకు మోక్షము ఎలా సిద్ధిస్తుంది?

**మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్,**
**మనస్యన్యం వచస్యన్యం కర్మణ్యన్యం దురాత్మనామ్** అని సూక్తి కదా!

**ఆ. వె. గాజు కుప్పెలోన గదలక దీపంబ**
**దెట్టులుండు జ్ఞాన మట్టులుండు**
**తెలిసినట్టి వారి దేహంబులందున**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**తాత్పర్యము:** తపములు, యోగము, ధ్యానము అభ్యాసము చేసి, పరమాత్మ స్వరూపమును దెలిసికొన్నవారి జ్ఞాన దీపము, వారి హృదయాంతరములో, గాజు కుప్పెలోనుంచిన దీపమువలె నిశ్చలముగా ప్రకాశించును. ఆ జ్ఞానదీపమే వారికి మోక్షమునకు దారి చూపును. 'ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశే2ర్జున తిష్ఠతి' అనేది గీతావాక్యము. జ్ఞానస్వరూపుడైన యీశ్వరుడు సర్వభూతముల యొక్క హృదయకుహరములలో వసించును. ఆయన మనలో జ్యోతిరూపముగా హృదయములో నుండునని ఉపనిషత్తులు కూడా తెలియజేయుచున్నవి. ఆ పరమాత్ముని తమలోను, ఎదురివారిలోనూ కూడా చూడగలిగిన వారు జ్ఞానులు, జీవన్ముక్తులు, నిత్యముక్తులు.

*(ఇందులో కొంత భాగము స్వామి చిదాత్మానందగారి 'వేమన పద్యములు - అంతరార్థము' ప్రవచనములలో ఒంట పట్టించుకున్న సారాంశము. పూజ్య శ్రీ స్వామి చిదాత్మానంద గారికి ధన్యవాదములతో...)*

***చిత్తశాంతి కావాలంటే సత్యం, ఆనందం, స్వరూపం కావాలి. స్వరూపమంటే (స్వ + రూపం) తనయొక్క రూపం.***